క్లుప్తంగా

దాడులను నిరసిస్తూ క్రైస్తవుల ర్యాలీ



జ్ఞానాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం : మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండకు, క్రైస్తవులపై దాడులకు వ్యతిరేకంగా ఆదివారం జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రక్షణగిరి రహదారిలో సెయింట్ పీటర్స్ స్త్రీల కమిషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సెయింట్ పీటర్స్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, సిస్టర్ సంగీత నేతృత్వంలో జ్ఞానాపురం గ్రామ మహిళలు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం రక్షణగిరి ముఖద్వారం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. క్రైస్తవులపై దాడులు అమానుషమన్నారు. వారికి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల కమిషన్ అధ్యక్షురాలు జీఎల్ రాణి, ఉపాధ్యక్షురాలు స్వర్ణలత, కార్యదర్శి పి.వేళాంగిణి, కోశాధికారి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి



బహుమతులతో చిన్నారులు

దాబాగార్డెన్స్ : సంప్రదాయ కళలను ప్రోత్సహించాలని ఏయూ సంగీత విభాగాధిపతి డాక్టర్ ఎ. అనురాధ పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సత్యరాజ్ సంగీతాలయం వ్యవస్థాపకుడు డాక్టర్ వై. బాలగణేష్ సారథ్యంలో సంగీతంపై నిర్వహించిన కార్యశాల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సభాధ్యక్షుడు ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయంలో భాగమైన కళలను ప్రోత్సహించాలని, మన భారతదేశం సాంప్రదాయాలు, కళలకు నిలయమన్నారు. ఈ సందర్భంగా విజేతలైన చిన్నారులకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంగీత కళాకారిణి పీవీఎస్ లక్ష్మి, కె. లిపికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హిందీ సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రైల్వే డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

దాబాగార్డెన్స్ : రాగమయి సంగీత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కందర్ప రాధ నేతృత్వంలో ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంగా నిర్వహించిన హిందీ సినీ సంగీత విభావరి అలరించింది. ఆజా సాం హోనే ఆయే పేరిట నిర్వహించిన సంగీత విభావరిని రైల్వే డివిజనల్ మేనేజర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గాయనీ గాయకులు పలు హిందీ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు పి. రాజేంద్రప్రసాద్, కార్యదర్శి ఎం. త్రినాథ్, ఉపాధ్యక్షుడు జేఎంఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

సింహాచలం: ప్లాస్టిక్‌ను నిషేధించాలని, పర్యావరణాన్ని కాపాడాలని గిరిప్రదక్షిణలో ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం ప్రభుత్వ హైస్కూల్ జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ఏపీ నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.బాబురావు ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన కల్పించారు. భక్తులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలిపారు. చెట్లను నరికివేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.

పౌర్ణమి పూజలకు వేళాయె



గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబవుతున్న అచ్చియ్యమ్మపేట షిర్డీసాయి ధ్యాన మందిరం



ఇసుకకొండపై వెలసిన సత్యదేవుని ఆలయం



రమా సహిత సత్యనారాయణ స్వామి

- ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు చేసిన వైదికవర్గాలు
- ప్రత్యేక పూజలందుకోనున్న సత్యనారాయణస్వామి, షిర్డీసాయి

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ఆషాఢ పౌర్ణమి (గురుపౌర్ణమి)కి ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు జరపనున్నారు. నిత్యపూజల అనంతరం ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక పూజలు, సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటలకు , 10 గంటలకు రెండు బృందాలుగా సామూహిక వ్రతాలు జరపనున్నారు. ఈ వ్రతంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. అలాగే ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్టు ఆలయ ఈవో బుద్ధ నాగజగదీష్ తెలిపారు.

ఆలయ చరిత్ర

ఈ దేవాలయాన్ని సుమారు 200 సంవత్సరాల కిందట సీతారామ్ బాబాజీ అనే సాధువు (సిద్ధి పురుషుడు) నిర్మించినట్టు పూర్వీకులు చెబుతారు. మహారాష్ట్ర నుంచి పాలరాతి విగ్రహాలు తీసుకొచ్చి ప్రతిష్ఠ చేసి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి దేవాలయం నానాటికీ అభివృద్ధి చెందుతూ నిత్య ధూప, దీప, నైవేద్యాలతో ఇక్కడ ఉత్సవాలు జరుగుతున్నాయి. 1966లో అప్పటి దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ దేవాలయాన్ని దర్శించుకుని ఈ దేవాలయాన్ని కనకమహాలక్ష్మి దేవాలయానికి దత్తత చేస్తే మరింత అభివృద్ధి చెందుతుందని భావించారు. అమ్మవారి దేవాలయంతో దత్తత చేసి అమ్మవారి నిధుల నుంచి సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రాజగోపురం, అనివెట్టి మండపం, విమాన గోపురం, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆగమ పండితుల సలహా మేరకు దక్షిణాది ఆచారం ప్రకారం కృష్ణశిల విగ్రహాలు (నల్లరాతి) కూడా ప్రతిష్ఠించారు.

శాకంబరిగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు..

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నీలమ్మ వేపచెట్టు అమ్మవారు శాకంబరిగా సోమవారం దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయాలు ముస్తాబు..

అల్లిపురం: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నియోజకవర్గంలో పలు ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట, శ్రీ షిర్డీసాయి ధ్యాన మందిరంలో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ప్రతినిధి ఉమ్మిడి నాగరాజు తెలిపారు. అదే విధంగా బంగారుమెట్ట సాయిబాబా దేవాలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయిబాబావీధి సాయిబాబా దేవాలయం, మూడుగుళ్ల జంక్షన్‌లో గల సాయిబాబా ఆలయం, టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం, అమ్మవారివీధి కొత్తమ్మవారి దేవాలయంలోని సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైతుబజార్‌లో రాయితీపై టమాటా విక్రయాలు



సీతమ్మధార రైతుబజార్‌లో టమాటాల విక్రయాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర భారీగా పెరగడంతో ప్రజలకు అందుబాటులో ఉండేలా కిలో రూ.50కే విక్రయించేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లో ఉదయం 7 గంటల నుంచి రాయితీపై టమాటాల అమ్మకాలు ప్రారంభించారు. మనిషికి ఒక్క కిలో చొప్పున మొత్తం 6 క్వింటాళ్ల టమాటాలను విక్రయించారు. వినియోగదారులు తమ ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్‌లను కౌంటర్ వద్ద చూపించి కిలో టమాటా కొనుగోలు చేశారు. రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్ల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు నేతృత్వంలో సహాయకుడు సతీష్ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో కొండబాబు మాట్లాడుతూ ఆదివారం 5,400 కిలోల టమాటాలు విక్రయించినట్లు తెలిపారు. అనంతరం మార్కెటింగ్ శాఖ డీడీ ఎర్రన్న, జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్, మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ రాయితీపై టమాటా విక్రయాలను పరిశీలించారు.

బాబా పాద దర్శనం నేడు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయినాథుడి మందిరంలో సోమవారం గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, ససపల వరప్రసాద్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు జరుగుతాయని, సాయినాథుడి పాద దర్శనం కల్పిస్తామన్నారు. 1008 లీటర్ల పాలతో సాయికి భక్తులు అభిషేకం చేస్తారని చెప్పారు.

గిరి ప్రదక్షిణ భక్తులకు నాయకుల సేవలు



పంపిణీకి సిద్ధం చేసిన పులిహోర

అల్లిపురం : సింహాచలం దేవస్థానం గిరి ప్రదక్షిణలో దక్షిణ నియోజకవర్గం నాయకులు తమ సేవలను అందించారు. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ రోడ్డు, ముడసర్లోవ వద్ద గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు పులిహోర పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, బొడ్డేటి కిషోర్, సంపత్ శ్రీనివాస్, మాల కొండయ్య, భక్తి మంగరాజు, కొటాన త్రినాథరావు, గుజ్జి సురేష్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాలను కొనసాగించారు.

ఉద్యమాలకు ప్రేరణ.. 'ది మ్యాంగో లేడీ'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి, ఆచార్య కె.ఎస్.చలం తదితరులు

సీతంపేట: ఉద్యమాలకు ప్రేరణ ఇచ్చే నవల 'ది మ్యాంగో లేడీ' అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ దినపత్రిక సబ్ ఎడిటర్ మల్లాజోస్యుల అనుపమ పద్మజ రచించిన ది మ్యాంగో లేడీ ఇంగ్లిష్ నవల పుస్తకావిష్కరణ సభ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సోంపేట పోరాట యోధురాలు జ్యోతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎం.నళిని పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కె.ఎస్.చలం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.మురళి, రచయితలు అట్టాడ అప్పలనాయుడు, శ్రీనివాసులు ప్రసంగించారు. ఉత్తరాంధ్ర వర్తమాన, సామాజిక జీవితపు వాస్తవ చిత్రీకరణ ఈ నవలలో రచయిత్రి చక్కగా పొందుపర్చారని, ఉద్యమాలకు ప్రేరణగా తోడ్పడుతుందని వక్తలు పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయాలి



రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాలెం: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏఐబీసీఎఫ్ జాతీయ కార్యదర్శి అల్లుసీరాజు అన్నారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార వుడా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖతో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సదస్సులో జాతీయ స్థాయిలో వెనుకబడిన తరగతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనేక జాతీయ అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బీసీ జనగణన కులాల వారీగా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తీర్మానించామన్నారు. సమాజంలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలను నిర్లక్ష్యం చేస్తే రాజకీయ పార్టీలకు మనుగడ లేకుండా చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఈబీసీ, ఎంబీసీ కుల గణన వంటి అంశాలను లేవనెత్తుతూ రాజీలేని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకత్వంలో బీసీ ఉద్యమం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సహించిన రాజకీయ పార్టీలను మాత్రమే ఆదరించాలని కోరారు. అనంతరం అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పప్పల రామ్మోహన్‌రావును ఏఐబీసీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య పంపిన ఉత్తర్వులను అల్లుసీరాజు అందజేశారు. అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ బీసీల సమస్యలపై జాతీయ స్థాయిలో రాజీలేని పోరాటం చేస్తున్న యోధుడు జస్టిస్ ఈశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైభవ్ వాకర్స్‌కు సంపూర్ణ సహకారం



వైభవ్ వాకర్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: వైభవ్ వాకర్స్ క్లబ్ నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అన్నారు. మురళీనగర్ సమీపం ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ్ పార్కులో వాకర్స్ బృంద సభ్యులతో ఏర్పాటు చేసిన వైభవ్ వాకర్స్ క్లబ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్ ఏర్పాటు ద్వారా స్థానికుల్లో నడక, ఆరోగ్యంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ ఉప్పలపాటి శుభ మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. ప్రస్తుతం 50 మందితో ఏర్పాటు చేసిన క్లబ్‌లో ఎక్కువ మందిని చేర్పించాలని సూచించారు. కార్యవర్గం ఏర్పాటు చేసుకుని వివరాలు సమర్పించిన వెంటనే రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ఈవో బండారు ప్రసాద్, దేవస్థానం అర్చకుడు శేషాద్యులు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేవీ ఉద్యోగి అదృశ్యం



అదృశ్యమైన ధీరజ్‌కుమార్

మల్కాపురం: ఓ యుద్ధనౌకలో సెయిలర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి అదృశ్యం అయ్యాడు. తూర్పు నౌకాదళం విభాగంలో ఎస్ఎస్ఎస్ వీరబాహు నౌకలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్ (28) ఈ ఏడాది జనవరిలో సెయిలర్‌గా (ఆర్ఎంఎస్ ర్యాంక్) చేరాడు. వీరికి ఆ నౌకలోనే భోజనం, వసతి సదుపాయం వంటివి అధికారులు కల్పిస్తారు. విధులు అనంతరం ప్రతి రోజు సాయంత్రం వీరు అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుండేవారు. ధీరజ్ శనివారం సాయంత్రం విధులు ముగించుకొని అవుట్ పాస్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తోటి సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు అతడి ఆచూకీ కోసం నౌకాపరిసర ప్రాంతాలు పరిశీలించారు. ఫలితం లేకపోవటంతో ఆదివారం నేవీ లెఫ్టినెంట్ కమాండర్ సుశీల్ ఉద్యోగి అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. మల్కాపురం ఎస్ఐ దేవుడమ్మ ఎస్ఎస్ఎస్ సింధూకేసరి నౌక వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడ ఇన్, అవుట్ గేట్ల వద్ద గల సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

పైనాపిల్‌కు గిరాకీ

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో పైనాపిల్‌కు గిరాకీ పెరిగింది. పార్వతీపురం జిల్లా సీతంపేటకు చెందిన వజ్రం రైతు ఉత్పత్తిదారు సంఘం ప్రకృతి సిద్ధంగా పండించిన పైనాపిల్‌ను ఆదివారం ఇక్కడ విక్రయించారు. కిలో రూ.35 చొప్పున విక్రయించినట్లు రైతులు ఎస్.జగ్గారావు, రవికుమార్ తెలిపారు. వీటి కొనుగోలుకు జనం ఆసక్తి చూపారు.

బదిలీల్లో జీవో అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, నాయకులు

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియలో జీవో 32ను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు కె.ఈశ్వరరావు కోరారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని ఎన్జీవో హోంలో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, రేడియోగ్రాఫర్లు, హెడ్ నర్సుల జీత భత్యాల చెల్లింపులో సమస్య వచ్చే అవకాశం వుందని, దానిని తక్షణం పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, నైట్ వాచ్‌మేన్‌ను నియమించాలన్నారు. ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం ద్వారా ఈ సమస్యలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో ఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



సెబాస్టియన్ కాలనీలో హెచ్‌డీ పోల్‌కు అల్లుకున్న పచ్చని పొదలు



గొల్లకంచరపాలెం సబ్‌వే మార్గంలో ఇలా..

- హెచ్‌డీ విద్యుత్ స్తంభాలపై పచ్చని పొదలు
- కరెంట్ షాక్‌తో స్థానికుల భయంభయం

కంచరపాలెం : పచ్చని పొదలు, మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయి. మానవాళికి మేలు చేస్తాయి. అయితే 41, 56 వార్డుల్లోని జ్ఞానాపురం సెబాస్టియన్‌కాలనీ, బాబుకాలనీ, ఎర్రిగెడ్డ పరిధిలోని ప్రాంతాలు, కంచరపాలెం ఆర్పీపేట రైల్వేగేటు రహదారి నుంచి ఊర్వశి కూడలికి వెళ్లే రహదారిలో ప్రమాదభరితంగా పెరిగిన పొదలు, తీగలు భయాందోళన కలిగిస్తున్నాయి. ఇవి హెచ్‌డీ (రాకెట్ పోల్స్) విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయి ఇష్టానుసారం పెరిగిపోతున్నాయి. దీనివల్ల వర్షాకాలంలో ఈ స్తంభాల సమీపం నుండి వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పచ్చనితీగలు తాకినప్పుడు విద్యుత్ షాక్ కొడుతుందని భయాందోళన చెందుతున్నారు. వీటిని తొలగించాలని కంచరపాలెం జోన్-2 ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగౌడ్

దాబాగార్డెన్స్ : విశాఖను పరిపాలన రాజధానిగా సాధించుకుందామని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ పిలుపునిచ్చారు. స్థానిక యువతకు (ఉత్తరాంధ్ర) 85 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమితి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాజు గౌడ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పోరుబాటను ప్రతి పల్లెకు, గ్రామానికి తీసుకెళ్లి, ఉత్తరాంధ్ర ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు పెత్తనం సాగించే రోజు తీసుకు వస్తామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కావాలంటే స్థానికులు అధికారం చేపట్టడమే శరణ్యమన్నారు. తెలంగాణ తరహాలో స్థానిక యువతకు విద్య, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో 85 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక అభ్యర్థులనే అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థులుగా ప్రకటించాలన్నారు.

ప్రత్యేక అలంకరణలో సాయి



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో షిర్డీసాయిబాబా

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయం గురుపౌర్ణమి వేడుకలను సిద్ధమైంది. సోమవారం బాబాను పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించనున్నారు. ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, 8.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు బాబాకు 300 కిలోల అన్నంతో అభిషేకం చేస్తారు. సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు రూ.516, అన్నాభిషేకానికి రూ.200 రుసుం చెల్లించి రసీదు పొందాలని నిర్వాహకులు కోరారు.

అన్న, పంచామృతాభిషేకాలు

జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6 నుంచి 8 గంటలకు పంచామృతాభిషేకం, 8 నుంచి 11 గంటల వరకు అన్నాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో పైలా శేఖర్‌బాబు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

నవ్వుల్లో ముంచెత్తిన కామెడీ స్కిట్లు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ షో ఆద్యంతం నవ్వులు పూయించింది. కామెడీ ఆర్టిస్టులు జబర్దస్త్ ప్రకాష్, ఎం.వి.సుబ్రహ్మణ్యం, రావి గోపీకృష్ణ, భానుప్రకాష్, శివజ్యోతి, అన్వేష, దామోదర్, ఇమంది ఈశ్వరరావు, జి.వి.త్రినాథ్, బుగత సత్యనారాయణ, శ్రీధర్, పుష్యమి, మల్లిక, పొర్లు శేషులు ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. ఫోన్ చేసి మరీ అడగాలా, కుక్క కరిచింది, కుక్కను అమ్మేస్తా, రక్తం, ఆర్టీసీ బస్సు, ఎఫ్4, స్కిట్స్ ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. ఈ సందర్భంగా కళాకారులను నందూరి రామకృష్ణ, ఎ.వి.రామకృష్ణ, దాసరి సాంబశివరావు తదితర అతిథులు సత్కరించారు.

అప్పన్న సన్నిధిలో పరిశ్రమల శాఖ కమిషనర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వారి పేరిట అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు.

శ్రీధర్‌కు సత్కారం

సీతంపేట: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నోయిడాలోని గౌతమ్ బుద్ధ యూనివర్సిటీలో జరగనున్న కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు నగరానికి చెందిన ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉద్యోగి వి.శ్రీధర్ టెక్నికల్ ఆఫీషియల్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయనను విజయాంధ్ర వ్యాయామ మండలి సభ్యులు, బుల్లయ్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రభాకర్‌రావు తదితరులు అభినందించారు.